అప్పులు, వివాహేతర బంధంతోనే అంతం?

- షేర్ మార్కెట్‌లో భారీగా నష్టాలు
- సహజీవనం చేస్తున్న మహిళ నుంచి ఒత్తిళ్లు
- భార్యాపిల్లలను చంపి, ఆత్మహత్య చేసుకున్న పోలీసు ఘటనపై ప్రాథమిక దర్యాప్తు



హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలో ఓ హెడ్ కానిస్టేబుల్ తన భార్య, ఇద్దరు కుమార్తెలను బుధవారం రాత్రి పిస్టల్‌తో కాల్చి తాను ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లాలో సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ సంఘటన గురువారం ఉదయం వెలుగు చూసిన విషయం విదితమే. షేర్ మార్కెట్ ద్వారా రూ.లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడని, మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడం వలనే అతను ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టాడని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ టి. వెంకటేశ్వర్(51) రైటర్‌గా విధులు నిర్వర్తిస్తుండే వారు. ఆయన మంచితనానికి మారుపేరుగా, వృత్తిలో నిబద్ధతగా పని చేసేవారని పేరు తెచ్చుకున్నాడు. ఆయనకు భార్య మాధవి(47)తోపాటు డిగ్రీ చేస్తున్న లాస్య(21), పదో తరగతి చదువుతున్న అభిజ్ఞ(16) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రాత్రి తన అభిజ్ఞను ట్యూషన్ నుంచి ఇంటికి తీసుకుని వచ్చాడు. తర్వాత మరలా స్టేషన్ వెళ్లి స్ట్రాంగ్‌రూంలోని పిస్టోల్‌ను తన వెంట తెచ్చుకున్నాడు. వారి ఇంటిలో ఏనాడూ గొడవలు జరగకపోవడంతో తమను చంపుతాడని భార్య,పిల్లలకు ఏమాత్రం తెలీదు. అలాంటి తరుణంలో కుటుంబ యజమాని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ కొన్ని గంటల వ్యవధిలోనే మృగంలా మారాడు. తన భార్య, పిల్లలను తానే చేతులారా చంపుతున్నానని మరచిపోయాడు. వారు నిద్రిస్తున్న సమయంలో పెద్ద కుమార్తె లాఖిన్య అలియాస్ లాస్యను మొదట నుదిటిపై కాల్చాడు. ఆమె కొనఊపిరితో వుందని భావించి ఛాతీపై కాల్చాడు. రెండవ కుమార్తె అభిజ్ఞ, భార్య మాధవిలను కూడా వారి నుదిటిపైనే పాయింట్ బ్లాంక్‌లో కాల్చేశాడు. చివరగా తాను కణతపై కాల్చుకుని మరణించాడు. నాలుగు మరణాలకు కారణం కేవలం వెంకటేశ్వర్ చేసుకున్న అప్పులు, వీటితోపాటు రమాదేవితో వివాహేతర సంబంధమేనని తెలుస్తోంది.

హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌కు షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టే అలవాటుంది. దీంతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నాడు. కొన్నేళ్ల క్రితం తన సోదరుడు హైదరాబాద్ నుంచి వచ్చి దాదాపు రూ.20 లక్షలు తీర్చి వెళ్లారు. ఈ ఏడాది జనవరిలో ఓ బ్యాంక్‌లో రుణం కూడా తీసుకున్నాడని సమాచారం. అంతేగాక పలువురి నుంచి అప్పులు తీసుకుని వారికి చెక్కులు, బాండ్లు ఇచ్చాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తన తల్లి మరణించిన సమయంలో అంత్యక్రియలను జరిపించేందుకు డబ్బులు లేకపోవడంతో సహచర సిబ్బంది ద్వారా తీసుకున్నాడు. అలాగే కొన్నేళ్ల క్రిందట రమాదేవితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఆమెతో సహజీవనం చేసేవాడు. ఆమె కూడా తనకు తెలిసిన వారు, బంధువుల దగ్గర అప్పు చేసి డబ్బులను ఇప్పించింది. ఆర్థిక సమస్యలున్నా, మరో మహిళతో సహజీవనం చేసినా భార్య, పిల్లలను ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. రమాదేవితో వివాహేతర సంబంధం వున్న విషయం తోటి కానిస్టేబుళ్లకు కూడా తెలీదు. ఏనాడూ సిబ్బందికి ఆర్థిక సమస్యల గురించి చెప్పలేదు. సోదరుడు, సోదరి హైదరాబాద్, బెంగళూరులో స్థిరపడ్డారు. బంధువులంతా ఆర్థికంగా బాగున్నారు. ఇటీవలి కాలంలో బంధువుల నుంచి క్షేమ సమాచారాలు లేవు. దీంతో వెంకటేశ్వర్ ఆర్థిక పరిస్థితి గురించి వారికి తెలియదు. ఆర్థిక సమస్యలతోపాటు రమాదేవి నుంచి ఒత్తిళ్లు వుండటంతో, వాటన్నింటిని మనసులో పెట్టుకుని ఎవరికీ చెప్పుకోలేక, తనతోపాటు తన కుటుంబాన్ని బలి తీసుకున్నాడు.

అన్యాయంగా కుటుంబాన్ని..

'సమస్య తనదైనపుడు అభం శుభం తెలీని భార్యాపిల్లలను ఎందుకు చంపాలి. అదేదో తానొక్కడే చనిపోయి వుంటే.. కుటుంబమైనా బాగా వుండేది కదా' అని అందరూ చర్చించుకుంటున్నారు. సమస్యలను భార్యాపిల్లల దగ్గర కానీ, స్నేహితుల వద్ద కానీ చర్చించకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది.

'స్నేహితులకో, బంధువులకో చెప్పి వుంటే ఎవరైనా సాయం చేసేవారు కదా.. ఎంతో అన్యోన్యంగా వున్న కుటుంబాన్ని ఎందుకు పొట్టన పెట్టుకున్నాడు' అని స్థానికంగా అంటున్నారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

నలుగురి మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి

హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్, భార్య, ఇద్దరు పిల్లల మృతదేహాలకు పోలీసులు కడప రిమ్స్‌లో సిటీ స్కానింగ్ చేయించారు. పిస్టోల్ ద్వారా కాల్చిన తరువాత సదరు బుల్లెట్‌లు ఎంత మేరకు శరీరంలోకి దిగబడ్డాయో తెలుసుకునేందుకు సిటీ స్కానింగ్ చేయించారు. తరువాత పోస్టుమార్టం చేయించారు. బంధువులకు మృతదేహాలను అప్పగించారు. పోలీసు అధికారులు, బంధువులు.. మృతదేహాలకు శుక్రవారం మోచంపేటలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. చివరిచూపు చూసేందుకు కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్‌ఐలు జయరాముడు, సంజీవరాయుడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు వచ్చి, బంధువులు వచ్చి అంత్యక్రియలలో పాల్గొన్నారు. మరోవైపు బెంగుళూరులో పెద్దకుమార్తె లాఖిన్య అలియాస్ లాస్య చదువుతున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు వచ్చి అశ్రునివాళి అర్పించారు.

ఉద్యోగికి బదిలీ తప్పనిసరి

చిన్నమండెం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని మల్లూరు జెడ్పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రెడ్డన్న పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం వారిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి వారు చేసిన సేవలను కొనియాడారు.

ఆర్థికసాయం

పుల్లంపేట : రెడ్డిపల్లి ఎస్టీకాలనీలో నివాసం ఉంటున్న తుపాకుల మణి విద్యుత్‌షాక్ కారణంగా అతని కుడి చెయ్యి, కాలి వేళ్లు తొలగించారు. రెడ్డిపల్లికి చెందిన గౌరీశంకర్ రూ.5 వేలు అందజేశారు.

నాటు సారాపై గట్టి నిఘా



జిల్లా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ వీబీ రాజ్‌కమల్

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో నాటుసారా తయారీ, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అడిషనల్ ఎస్పీ వీబీ రాజ్‌కమల్ అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో నెల వారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. నాటుసారా తయారీ, విక్రయాలపై నమోదైన కేసుల వివరాలను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నాటుసారా తయారు చేసే గ్రామాల్లో అధికారులు ప్రతి రోజూ 2 లేదా 3 గ్రామాలలో తనిఖీలు నిర్వహించాలని ఏఎస్పీ సూచించారు. సిబ్బంది సహకారంతో నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుతమని తెలిపారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల చెక్‌పోస్టుల వద్ద అధికారులు వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించాలన్నారు. తద్వారా ఇతర ప్రాంతాల నుంచి ప్రభుత్వం నిషేధించిన గుట్కా, ఖైనీ అక్రమ రవాణా జరగకుండా అరికట్టవచ్చని పేర్కొన్నారు. జూదం, క్రికెట్ పందేలు నిర్వహించకుండా కట్టడి చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణా నివారించేలా మదనపల్లి, మొలకలచెరువు సరిహద్దు రాష్ట్రాలలో నిఘాను పెంచాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బందికి సూచించారు. అలాగే సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవడం ద్వారా కచ్చితమైన సమాచారంతో నాటుసారా తయారు చేసే బట్టీల పైన, రవాణా చేసే ప్రదేశాల్లోనూ దాడులు నిర్వహించాలన్నారు. నాటుసారా తయారీలో అక్రమ రవాణాలో సంబంధం ఉన్న అనుమానితులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి వారిని బైండోవర్ చేయాలని సూచించారు. నాటుసారా కేసులో జైలుకు వెళ్లి వచ్చిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించడం ద్వారా.. తిరిగి నాటుసారా జోలికి వెళ్లకుండా చేయాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలలో ఎక్కువ కేసులలో ఉన్న వారిపై పీడీ యాక్ట్‌కు సిఫార్సు చేయాలని అడిషనల్ ఎస్పీ అధికారులకు తగిన సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇచ్చారు.

ప్రకృతి శోభితం.. సుందర నిర్మాణం

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. ఆ క్రమంలోనే పట్టణ నడిబొడ్డున ఒక కోటి 53 లక్షల రూపాయలతో సుందరంగా నిర్మించిన పార్కు ప్రారంభానికి సిద్ధమైంది. ఇప్పటికే ఎస్ఎన్ కాలనీ సమీపంలోని గున్నికుంట్ల రోడ్డులో వాకింగ్ ట్రాక్‌తో పాటు రూ.6 కోట్లతో పట్టణంలో మరికొన్ని పార్కులను ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పట్టణంలోని డైట్ బాలుర వసతి ప్రాంగణంలో ప్రజలకు ఉపయోగపడే పార్కు, 500 మీటర్లు నడవడానికి అద్భుతమైన ప్రదేశం, పార్కులో జిమ్, యోగా, మెడిటేషన్ ప్రాంగణం, కిడ్స్ జోన్, పిల్లలు ఆడుకోవడానికి పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. వృద్ధులు సైతం సేదతీరేలా కుర్చీలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆడుకోవడానికి క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. డైట్ వసతి ప్రాంగణంలో ఉద్యానవనంతో కూడిన పచ్చని మొక్కలు పెంచడంతో సహజ పర్యావరణంతో నిండి ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో



డైట్ కేంద్రంలోని పార్కులో అందుబాటులోకి వచ్చిన వాకింగ్ ట్రాక్

పార్కును సందర్శించడానికి, వాకింగ్ చేయడానికి ప్రజలు అధికంగా వస్తున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌ల చేతులమీదుగా నేడు ప్రారంభం

డైట్ బాలుర వసతి ప్రాంగణంలో రూ.1.53 కోట్లతో నిర్మించబడిన పార్కును శనివారం ప్రారంభించనున్నారు. ఈ పార్కును రాజంపేట, ఎంపీ పివి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాల చేతుల మీదుగా ప్రారంభం చేయనున్నట్లు మునిసిపల్ ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు.

జైలు శిక్ష

నందలూరు (రాజంపేట) : మండలంలోని ఆడపూరు గ్రామంలోని మంచాలమ్మ ఆలయంలో హుండీలో దొంగతనం చేసినందుకు నేరం రుజువు కావడంతో జడ్జి లత ఇద్దరు దొంగలకు ఎనిమిది నెలలు జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నందలూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబరు. 196/2020 యు/ఎస్457,380 ఐపీసీ , సీసీ నెంబరు 05/2022 కేసులోని ముద్దాయిలు రాజంపేట మండలం బోయనపల్లికి చెందిన నాగాలరపు పుల్లయ్య, గురునాథం ఇషాక్‌లు మంచాలమ్మ గుడిలో 2020, డిసెంబర్ 13వ తేదీన హుండీ దొంగతనం చేసిన నేరం కోర్టులో రుజువైనందున వీరికి ఎనిమిది నెలలు జైలు శిక్ష విధించారు. దీంతో ఇద్దరిని రాజంపేట సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. ముద్దాయిలకు శిక్షపడుటకు ఏపీపీ ఉమారాణి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడులు విశేష కృషి చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం

చిన్నమండెం : ఇటీవల మండల పరిధిలోని చాకిబండ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సీసీ రోడ్డు సమస్య ఉందని ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలకు తెలియజేశారు. దీంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి సీసీ రోడ్డును వేయించారు. ఆ రోడ్డును శుక్రవారం దేవనాథరెడ్డి ఆదేశాలతో సీసీ రోడ్డు పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. దీంతో చాకిబండ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

రాజంపేట : ఈనెల 3న పట్టణ శివార్లలో బైకులు ఢీ కొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడిన రాజంపేట పట్టణానికి చెందిన శశిధర్(45) తిరుపతిలో నారాయణాద్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరుపతి తీసుకొచ్చిన మృతదేహానికి రాజంపేట ప్రాంతీయ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల అధిక శబ్దానికి బ్రేక్

రాజంపేట : పట్టణంలో కొంత మంది యువత పెద్దపెద్ద సౌండ్స్‌తో బైకులను నడుపుతూ ప్రజలను ఇబ్బంది పెట్టడం అధికమైంది. వీరికి పోలీసులు బ్రేక్ వేశారు. శుక్రవారం అర్బన్ సీఐ నరసింహారావు నేతృత్వంలో పట్టణ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో.. శబ్దకాలుష్యం చేసే బైకులను గుర్తించేందుకు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టామన్నారు. కొంత మంది ప్రత్యేకించి పెద్దగా సౌండ్ వచ్చేందుకు సైలెన్సర్లు పెట్టుకొని తిరుగుతు



సైలెన్సర్లను తొక్కించేస్తున్న సీఐ, ఎస్ఐ, పోలీసులు

న్నారన్నారు. మొదటిసారిగా వారి బైకులు ఉన్న సైలెన్సర్లను పీకివేశామన్నారు. వాటిని రోడ్‌రోలర్‌తో తొక్కించామన్నారు. మరోసారి ఇలాగే ప్రవర్తించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి, బైకులను సీజ్ చేస్తామన్నారు. రోడ్డు రవాణా నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పెనగలూరు : మండలంలోని చక్రంపేట జెడ్పీహెచ్ఎస్‌లో గత ఏడాది పదో తరగతిలో మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ కృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలో గల శ్రీ సద్గురు దర్గా మాతాజీ (శ్రీమతి గంగిశెట్టి రంగనాయకమ్మ) ఎడ్యుకేషనల్ ట్రస్టుకు నీట్, ఎంసెట్‌లలో 2 వేలలోపు ర్యాంకు వచ్చిన వారికి స్కాలర్‌షిప్‌లు పొందుటకు విద్యార్థులు ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు వెంకట సత్యమయ్య తెలిపారు. రాయచోటి నియోజక వర్గ పరిధిలోని రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలం పరిధిలోని విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకోదలచిన విద్యార్థులు ట్రస్టు సెల్ నెంబరు 9441402901 ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు. 2022–23 సంవత్సరానికి ఈ స్కాలర్‌షిప్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

రుణాల పంపిణీపై ప్రత్యేక శిబిరం నేడు

రాజంపేట టౌన్ : టీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో రుణాల పంపిణీపై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుశాంత్ స్వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్ ముఖ్య అతిథిగా పాల్గొని రూ.7 కోట్ల రుణాలను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రైల్వేకోడూరు : మండలంలోని 220 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7.30 నుంచి 10 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు శుక్రవారం విద్యుత్‌శాఖ డీఈఈ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 33కెవి రైల్వేకోడూరు ఫీడర్ పరిదిలోని కోడూరు, మ్యాంగో యార్డు, జంగిటివారిపల్లె, శెట్టిగుంట, బొమ్మవరం, కడియాలపల్లె, వెంకట్రాజుపల్లె, నాగవరం, తూర్పుపల్లె, వీవీకంద్రిగలలోని సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత

రైల్వేకోడూరు : మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళా సచివాలయ పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ భద్రత కోసం పోలీసులు నిరంతరం నూతన టెక్నాలజీతో కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళలు, పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చేలా..

- తిరునాలను తలపిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- ఉచితంగా మందులు పంపిణీ చేసిన నాయకులు, అధికారులు



రాయచోటి అర్బన్: శిబిరానికి హాజరైన మాధవరం గ్రామస్తులు



ఓబులవారిపల్లె: వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

రైల్వేకోడూరు అర్బన్ : అనారోగ్యంతో బాధపడేవారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బొజ్జవారిపల్లె ప్రభుత్వ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల రక్తహీనతపై ప్రత్యేక ధ్యాస పెట్టి, మ్యాపింగ్ చేసి మందులతో పాటు ఫుడ్ సప్లిమెంటేషన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి రమేష్, సర్పంచ్ సుబ్బయ్య, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, తోట శివసాయి, జెట్పీటీసీ రత్నమ్మ, ఉప సర్పంచ్ సిద్దు, వెంకటసుబ్బయ్య, వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వార గ్రామీన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతుందని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. శుక్రవారం పెద్దఓరంపాడు పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమన్ని నిర్వహించారు.

నందలూరు (రాజంపేట) : ప్రజాఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ సౌభాగ్యమ్మ అన్నారు. శుక్రవారం నందలూరు గ్రామ పంచాయతీ పరిధిలోని షాదీఖానాలో సర్పంచ్ మోడపోతుల సుభాషిణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెనగలూరు: ప్రతి పేదవారు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీధర్ రావు ఎంపీడీఓ వరప్రసాద్, పెనగలూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, స్థానిక సర్పంచ్ కేతా చక్రపాణిలు అన్నారు. శుక్రవారం నారాయణ నెల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది.

రాయచోటి అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్షతో అందరి ఆరోగ్యాలు సురక్షితంగా ఉంటాయని మండల ప్రత్యేకాధికారి రాజశేఖర రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని మాధవరం -1 సచివాలయంలో శుక్రవారం ఆయన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 437 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

లక్కిరెడ్డిపల్లె : పేద ప్రజలకు రక్ష జగనన్న సురక్ష అని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కుర్నూతల గ్రామ పంచాయతీలో సర్పంచ్‌లు రమణయ్య, సిద్దక నాగిరెడ్డి, ఎంపీటీసీలు జగన్‌మోహన్ రెడ్డిలతో కలిసి నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

గాలివీడు : గ్రామాల్లో ప్రతి ఒక్కరికి ఆరోగ్యవంతమైన పాలనను అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్య ఉద్దేశమని వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గోరాన్‌చెరువు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదరికాన్ని సంక్షేమ పథకాలతో తొలగిస్తూ, జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజల ఆరోగ్యాన్ని బాగుపరచడం కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం జరుగుతోందని ఆయన వివరించారు.

రామాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ హైదర్‌వలి అన్నారు. శుక్రవారం మండలంలోని కుమ్మరపల్లె ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కార్యక్రమం నిర్వహించారు.

సంబేపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మారుతుందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గున్నికుంట్ల పంచాయతీలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

నందలూరు (రాజంపేట) : నందలూరు షాదీఖానాలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చెన్నకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరికీ వైద్యం అందాలని జేఏఎస్ క్యాంపు వల్ల జరిగే ఉపయోగాలు అందరికీ తెలియజేయాలని సూచించారు.

వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పాడి రైతుకు ఉచిత మందులను అందిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు, పథకాలు ప్రవేశపెట్టి రైతులకు అవగాహన కల్పిస్తున్నారని శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలు తెలిపారు. మండలంలోని కె.బుడుగుంటపల్లిలో కృషి మహోత్సవ్‌లో భాగంగా వ్యవసాయ అనుబంధ శాఖలచే రైతులకు అవగాహన కల్పించారు. స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

లక్కిరెడ్డిపల్లె : ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై క్షేత్రస్థాయిలో సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు అవసరమైన మెళుకువలు సూచించాలని ఎంపీపీ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యులు రవిరాజు, అగ్రికల్చర్ ఏడీ జయరాణి, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఏఓ రమేష్ బాబురావు, ఉపసర్పంచ్ రాజారెడ్డిలతో కలిసి నిర్వహించిన సంకల్ప సప్తహ్ కృషి మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. అన్నమయ్య ఏడీఏ వరలక్ష్మీ మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు ఈనెల 9వ తేదీలోపు ఈ–క్రాప్ చేయించుకోవడంతోపాటు ఈకేవైసీ తప్పక చేయించుకునేలా రైతులకు సిబ్బంది తెలియజేయాలన్నారు. కృషి మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లాలో లక్కిరెడ్డిపల్లి మండలం ఎంపికైందన్నారు.

ప్రతి రైతును ఈ–క్రాప్‌లో నమోదు చేయాలి

రామాపురం : ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేసిన ప్రతి రైతు పొలంలో సిబ్బంది ఈ–క్రాప్ నమోదు చేయాలని ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నల్లగుట్టపల్లి, బండపల్లె గ్రామంలో సాగు చేసిన వరి పంట భూములలో ఈ–క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,327 ఎకరాలలో వరి పంటను రైతులు సాగు చేశారని, అన్ని గ్రామాల్లో ఇప్పటికే ఈ–క్రాప్ నమోదు పూర్తయ్యిందని, మిగిలిన రైతులు ఎవరైనా ఉంటే సిబ్బందితో సంప్రదించి నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ అరవింద్ కిషోర్, వీఆర్‌ఓలు విగ్నేష్, అమీర్‌బాషా, గ్రామ సర్వేయర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

రాజంపేట : నందలూరు, కడప సెక్షన్ల పరిధిలో సౌత్ సెంట్రల్ రైల్వే కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల హోరు జోరందుకుంది. పోటాపోటీగా నేతలు శుక్రవారం ఉభయ జిల్లాలోని వివిధ రైల్వేస్టేషన్లలో ప్రచారం చేశారు. కడప, నందలూరు మజ్దూర్ యూనియన్, సంఘ్ నేతలు స్టేషన్లవారీగా వెళ్లి కార్మికులను కలుసుకొని కరపత్రాలను పంచారు. తమ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని సంఘ్, మజ్దూర్ కార్మికనేతలు అభ్యర్థించారు. నందలూరు సెక్షన్ పరిధిలో భాకారాపేట నుంచి బాలపల్లె(తిరుపతి జిల్లా) వరకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కడప సెక్షన్‌లో కొండాపురం, ఎర్రగుంట్ల నుంచి జమ్మలమడుగు వరకు సొసైటీ ఎన్నికల ప్రచారాన్ని జరిపారు. సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తరపున నందలూరు సెక్రటరీ విశ్వనాథ్, కడప బ్రాంచి సెక్రటరీ మధుసూదనరావు, రవిప్రకాశ్, కడప బ్రాంచి నేత ఈశ్వరయ్యల ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగుతోంది.

ఓటరు జాబితాపై అపోహలు వీడండి

వీరబల్లి(రాజంపేట) : ఓటర్ల జాబితాపై అపోహలు వీడనాడలని తహసీల్దారు మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మట్లి గ్రామ పంచాయతీలో సర్పంచి సోమారపు నాగార్జునాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన తహసీల్దారు మాట్లాడుతూ మార్పులు, చేర్పులు నిబంధనల మేరకు జరుగుతాయన్నారు. ఓటరు జాబితాలో పేరు చేర్చాలన్న, తీసివేయాలన్న ఎన్నికల సంఘం సూచనల మేరకు జరుగుతుందన్నారు. ఏదైనా సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానిక వర్గాల నాయకులు పాల్గొన్నారు.

'లంకమల'లో కూంబింగ్



కూంబింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం : ఎర్రచందనం స్మగ్లర్ల కోసం లంకమల అభయారణ్యంలో శుక్రవారం కూంబింగ్ నిర్వహించినట్టు రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ కడప బీటులో ఎర్రచందనం స్మగ్లర్లు ఉన్నారన్న సమాచారంతో కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి అదేశాల మేరకు ముందస్తు చర్యగా సిద్దవటం అటవీశాఖ పరిధిలో కూంబింగ్ నిర్వహించామన్నారు.